
# యుద్ధం

సలీం




**చుట్టూతా చీకటి. తుపాకులు పేలినపుడు ఎగసి పడుతున్న నిప్పురవ్వలు తప్ప కళ్ళకేమీ కన్పించటం లేదు. దూరంగా బాంబుపడి పేలిన శబ్దం... ఎవరిదో చావుకేక. మావాళ్ళదా శత్రువులదా తెలీటం లేదు. నాకు చీకటంటే భయం లేదు..చావన్నా భయం లేదు. కానీ ఒంటరితనమంటే భయం. పక్కన అలికిడి ఆగిపోయింది.**

"అభిరాం" అని పిల్చాను.

"ష్ మెల్లగా. వాళ్ళు చాలా దగ్గరలో ఉన్నారు." అన్నాడు.

"వాళ్ళు చాలామంది ఉన్నారనిపిస్తోంది. మనం ముగ్గురమే ఉన్నాం. ఏం చేద్దాం?" అని అడిగాడు ఖలీల్. ఇరవై రెండేళ్ళ వయసు. పెళ్ళయి మూడు నెలలు. ఏ ముచ్చటా తీరకముందే యుద్ధం ముంచుకొచ్చింది.

"మనవాళ్ళు ఎంతమంది ఉన్నారో ఎక్కడ ఉన్నారో తెలీటం లేదు. అసలు ఉన్నారా అనేది అనుమానమే. ఈ పరిస్థితుల్లో మనం ఫైరింగ్ చేయటం చాలా ప్రమాదం. మన ఉనికి శత్రువుకి తెల్సిపోతుంది. పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేస్తారు. ముగ్గురం చచ్చిపోవటం ఖాయం." అన్నాను.

"అలాగని పిరికిపందల్లా పారిపోవాలంటావా? నెవర్...చావంటే నీకు భయ

మేమో నువ్వాపని చేయి. నేను ముందుకు దూసుకెళ్ళటానికే నిర్ణయించుకున్నా. శత్రువు ఎదురుగా ఉన్నాడని తెల్సి కూడా వాణ్ని చంపకపోతే నేను భారతీయ సైనికుణ్ణే కాదు.'' అన్నాడు అభిరాం.

''బాగా చెప్పావు భాయ్! ముగ్గురమంటే మాత్రమేం? ఒక్కొక్కరం కనీసం పదిమందినైనా సరే చంపికాని చావం. నేను రెడీ. నువ్వు చార్జ్ అను చాలు. ముందుకురుకుతా.'' అన్నాడు ఉత్సాహంగా ఖలీల్.

ఇద్దరిదీ ఉడుకు రక్తం. ఆవేశం తప్ప ఆలోచన లేని మాటలు..

''మీ ఇద్దరికన్నా నేను పెద్దవాణ్ని. వయసులోనే కాదు అనుభవంలో కూడా. కేవలం జీవితానుభవం గురించి నేను మాట్లాడటంలేదని మీ ఇద్దరికీ తెలుసు. యుద్ధభూమిలో అడుగు పెట్టటం నాకు కొత్త కాదు. చావంటే భయపడి చెప్పటం లేదు. చావు కూడా మూర్ఖంగా కొని తెచ్చుకోకూడదు. యుద్ధతంత్రం చాలా ముఖ్యం. మన ఒక్కొక్కరం పదిమందిని చంపటం గురించి మీరు ఆలోచిస్తున్నారు. నేనా బెటాలియన్ మొత్తాన్ని లేపెయ్యటం గురించి ప్లాన్ చేస్తున్నా. వాళ్ళు చీకటిలో ముందుకొస్తున్నారు. మనకు అడ్వాంటేజ్ అదే. మనం ఫైరింగ్ చేస్తే తప్ప మనం ఎక్కడ ఉన్నామో ఎంత మందిమి ఉన్నామో శత్రువు పసిగట్టలేడు. వాళ్ళొస్తున్న దారిలో మందుపాతరలు పెడ్దాం. అడుగు ముందుకు వేస్తే ముక్కలు ముక్కలైపోతారు.'' అన్నాను.

''చాలా మంచి ఆలోచన.'' అన్నాడు అభిరాం.

''యా అల్లా... దొంగచాటుగా దెబ్బకొట్టటం ఏం న్యాయం? ఎదురు నిలిచి పోరాడదాం. విజయం వరించిందా సరే లేదా షహీద్ అన్పించుకుంటా'' అన్నాడు ఖలీల్.

యుద్ధంలో దెబ్బకొట్టటమే ప్రధానం. అది నేరుగానా దొంగచాటుగానా అనేది ముఖ్యం కాదు. గెలుపు ముఖ్యం. శత్రువుని సమూలంగా తుదముట్టించటం ముఖ్యం. ఇక్కడ న్యాయాన్యాయాల ప్రసక్తి లేదు. మనం వాణ్ణి చంపకపోతే వాడు మనల్ని చంపుతాడు. వాడు మనల్ని చంపేలోపల మనం వాణ్ణి మట్టి కరిపించాలి. దానికోసం ఎన్ని మాయోపాయాలు పన్నినా, ఎన్ని కుట్రలూ కుతంత్రాలు చేసినా తప్పు లేదు.''

''సరే...కానీ వాళ్ళు ఎటువైపుగా వస్తారో ఎలా చెప్పగలం?'' సందేహాన్ని వ్యక్తపరిచాడు ఖలీల్?

''నిజమే. వాళ్ళు ఎటువైపుగా అయినా రావచ్చు. మనం కేవలం గెస్ చేయగలం. అంతే. ఇంటెలిజెంట్ గెసింగ్. ప్రాపబిలిటిస్‌ను బేరీజు వేసుకుని దేవుడి మీద భారమేసి మన కర్తవ్యం మనం నిర్వర్తించడమే.''

''చేసేదంతా మనం చేస్తూ మధ్యలో దేవుణ్ణి లాగటం దేనికి?'' అన్నాడు అభిరాం.

''అలా అనుకుంటే ఎంతటి మనశ్శాంతి!'' అంటూ మెల్లగా నవ్వాను. అభిరాం దేవుళ్ళని నమ్మడు.

ముగ్గురం వీలైనంత నిశ్శబ్దంగా మందుపాతర తవ్వే పనిలో నిమగ్నమైనాం.. మధ్యమధ్యలో తుపాకీ శబ్దాలు.. దగ్గరగా..మరింత దగ్గరగా...

''తొందరగా కానివ్వాలి. సమయం లేదు.'' అంటూ హెచ్చరించాను.

''పుస్తకాల్లో మహాభారత యుద్ధం గురించి చదువుకున్నాం. ఎంత ధర్మబద్ధంగా చేసేవారో'' అన్నాడు ఖలీల్.

''సూర్యాస్తమయం తర్వాత యుద్ధం చేయకూడదనేది అప్పటి నియమం. నిరాయుధుడితో తలపడకూడదనేది అప్పటి న్యాయం. అవన్నీ ఈ రోజుల్లో చెల్లుబాటు కావు. ఇరాక్ పైనా, ఆఫ్ఘనిస్తాన్ పైనా రాకెట్లు ప్రయోగించి నిద్దర్లు పోతున్న వేనవేల సామాన్య ప్రజల్ని ఎంతమందిని చంపేశారో? ఇపుడు యుద్ధనీతి ఒక్కటే. ఎదుటి వ్యక్తికి అపార నష్టం కలిగించడం. అన్ని రకాలుగా భయభ్రాంతుల్ని చేసి పాదాక్రాంతం చేసుకోవడం'' అన్నాను.

చాలా సమీపంగా సమూహాలు కదులుతున్న అలికిడి. మేం మెల్లగా వెనక్కి నడవడం ప్రారంభించాము. కొద్దిదూరం వెళ్ళాక పరుగు అందుకున్నాం.

పెద్ద విస్ఫోటనం.. కళ్లు మిరుమిట్లు గొలిపే కాంతి.. మనుషుల హాహాకారాలు.. ఆర్తనాదాలు. శరీర భాగాలు తునాతునకలై ఎగిరిపడ్తున్నాయి. దాంతోపాటే మాపైన గుండ్ల వర్షం..

వెనక్కి తిరిగి ''జై భారత్'' అంటూ ముందుకు పరుగెత్తాడు ఖలీల్. నేనూ, అభిరాం తూటాలు పేలుస్తూ అతని వెనకే శత్రువు వైపుకురికాం.

''యా అల్లా'' అంటూ ఆర్తనాదం. దబ్బున కింద పడిపోయాడు ఖలీల్. నేను ముందుకు పరుగెత్తుతూనే ఉన్నా. అభిరాం ఆగిపోయాడు. ''మన ఖలీల్ పడిపోయాడు. బులెట్ ఎక్కడ తగిలిందో? నేనెళ్ళి చూస్తాను.'' అంటూ వెనక్కి తిరిగాడు.

నేనాగకుండా పరుగెత్తుతూనే పెద్దగా అరిచాను. ''మూర్ఖంగా ప్రవర్తించకు. ముందుకురుకు ఇక్కడ ప్రేమానురాగాలకు తావు లేదు. సెంటిమెంట్స్ వద్దు. అనుబంధాలూ ఆత్మీయతలు మర్చిపో. చంపు. లేకపోతే చస్తావు.''

అభిరాం కూడా కర్తవ్యాన్ని గుర్తించి నా వెనకనే వస్తున్న చప్పుడు.. నిప్పులు కక్కుతున్న అతని తుపాకీ..

ముందుకు పరుగెత్తున్నవాణ్ణి దబ్బున పడిపోయాను. కాలు మెలిక పడిందా?పట్టుతప్పి జారిపడ్డానా.. ఓ క్షణం ఏమీ అర్థం కాలేదు. మురుక్షణం కుడి తొడలో భగ్గున మంట... తూటా దిగిందని అప్పుడర్థమైంది. ఒకచోట కాదు.. నాలుగు చోట్ల... నా కుడికాలిని భయంకరమైన మొసలి తన పదునైన దంతాల్తో కొరికేస్తున్నట్లు.. బాధ.

ఎవరివో చావు కేకలు.. మాంసం కాలుతున్న వాసన.. అంత బాధలోనూ శత్రువుకి దొరక్కూడదన్న పట్టుదల.. పాక్కుంటూ పొదలచాటుకి.. చీకట్లోకి జారుకుంటూ..


నాకోసం వెతుకుతున్న ముష్కరమూకలు.. పళ్ళ బిగువున బాధని భరిస్తూ.. నిమిషాలు యుగాలుగా మారి హింసిస్తూ ... చివరికి అంతా నిశ్శబ్దం.. నేనూ నాబాధ... ఒంటరిగా తొడకైన గాయాల్లోంచి నిర్దయగా కారుతున్న రక్తం...నన్ను కాపాడిన చీకటి ఇపుడు భయపెడుతూ

ఇలానే చచ్చిపోతానా.. నాకోసం ఎవ్వరూ రారా.. నన్నెవ్వరూ రక్షించరా..ఖలీల్ ఏమైనాడో? అభిరాం ఏమైనాడో? నేనేగా చెప్పాను.. యుద్ధభూమిలో అనుబంధాలకు తావులేదని... కానీ ఇపుడనిపిస్తోంది నన్నెవరైనా పట్టించుకుంటే బావుండునని..నాకేమీకాదని ధైర్యం చెప్తే బావుండునని.. నేను చావనని హామి ఇస్తే బావుండునని.. నేను ఒంటరిని కానని తాను తోడున్నానని ఎవరైనా అంటే ఎంత బావుంటుంది? ఏ దేవుడో దేవతో ప్రత్యక్షమై నేనున్నాను అనరా? ఈ గాయం కన్నా ఒంటరితనం భయపెడ్తోంది. చచ్చిపోతానేమోననే దిగులుకన్నా ఎవ్వరూ పక్కన లేకుండా చచ్చిపోతున్నాననే దిగులే నన్ను వేగంగా మృత్యువు వైపుకి లాగుతోంది.

మెల్లగా మూలుగుతున్నా.. నొప్పి..నిస్త్రాణ..నీరసం.. ఎంత రక్తం పోయిందో? బకెట్లతో బైటికి తోడేస్తున్నట్లు.. చచ్చిపోతున్నాను.. కళ్ళు మూసుకుపోతున్నాయి. చీకటి.. నేను చీకటిలో లయమై పోతూ...

---

కళ్ళు తెరిచి చుట్టూ చూశాను. నులి వెచ్చటి వెల్తురు మొహంమీద పడింది. కళ్ళు భగ్గున మండాయి. వళ్ళంతా సలపరం. మంచంమీంచి



లేవాలనిపించలేదు. కిటికీని మూసేసి కర్టెన్ లాగాను. గదినిండా చల్లటి చీకటి పర్చుకుంది.

గది బైట కొడుకూ కోడలు మాట్లాడుకోవటం లీలగా విన్పిస్తోంది.

''రాత్రి నూట మూడుంది టెంపరేచర్. డాక్టర్ దగ్గరకు పిలుచుకెళ్ళటం మంచిదేమో. ఈ వయసులో ఎటుపోయి ఎటొచ్చినా మనకు మాటొస్తుంది. రిటైర్మెంట్ డబ్బులూ, పెన్షన్ డబ్బులూ తినేసి కొడుకూ కోడలు పట్టించుకోలేదంటారు.''

''మూడు పూటలా తేరగా కూచోబెట్టి తిండి పెడ్తున్నాంగా. అంతకన్నా ఇంకేం పట్టించుకోవాలి? డాక్టర్లకూ, దర్జాలకూ పెట్టటానికి మన దగ్గర డబ్బులు రాసులు పోసేంలేవు. ఆర్నెల్లనుంచి ఖాళీగా యింట్లో కూచోకపోతే బైటికెళ్ళి ఏమైనా పని చేసుకోవచ్చుగా. ఇలా రోగాలో రొష్టులో వస్తే అక్కరకు వస్తాయి.''

''పెద్దగా మాట్లాడకు. ముసలాయనవి పాము చెవులు.''

''ఇందులో రహస్యమేం లేదు. గుసగుసలు పోవడానికి. ఉన్న మాటే చెప్తున్నాను. మీ నాన్నకొచ్చే ముష్టి రెండువేల పెన్షన్ ఏమూలకు సరిపోతుందని.''

''ఇపుడా రామాయణమంతా ఎందుకు? నాకు ఆఫీస్‌లో చాలా పనుంది. నువ్వే రోజు శెలవపెట్టి ఆయన్ని హాస్పిటల్‌కి పిల్చుకెళ్ళు.''

''మనవేమీ గవర్నమెంట్ ఉద్యోగాలు కాదు. శెలవ చీటి పడేసి రోడ్లెంబడి తిరగడానికి.. తుమ్మితే వూడిపోయే ముక్కు.. నాకు వీలు కాదు. కావాలంటే మీరు పిల్చుకెళ్ళండి. ఉద్యోగం పోగొట్టుకుని పిల్లల భవిష్యత్తుతో ఆడుకోలేను. మీకేం మగమహరాజులు... ఏం చేసినా చెల్లుతుంది.''

''అంటే ఏంటి నీ ఉద్దేశ్యం...నువ్వొక్కదానివే పిల్లల గురించి రెక్కలు ముక్కలు చేసుకుంటున్నట్లు మాట్లాడ్తున్నావు. నేనూ కష్టపడేది వాళ్ళకోసమేగా. నీకన్నా వాళ్ళ గురించి ఎక్కువే ఆలోచిస్తాను.''

''ఉత్త మాటలు దేనికి చేతల్లో లేనప్పుడు.. ఇద్దరు పిల్లలు.. అందులో ఒకటి నా ఖర్మకాలి ఆడపిల్ల. చదువులెంత ఖరీదైపోయాయో మీ నాన్నకు తెలీదా.. ఈ పిల్లల్నెలా పోషించాల్రా భగవంతుడా ఎలా పెంచి పెద్ద చేయాల్రా అని పగలురాత్రి దిగుళ్ళతో చచ్చిపోతున్నాను తెలుసా. మిలట్రీలో పనిచేసి వచ్చాడుగా మీ నాన్న. ఆ మాత్రం జ్వరాన్ని కూడా తట్టుకోలేడా? రెండు బిళ్ళలు మింగితే పోయేదానికి డాక్టర్లు కావాలా?''

''అబ్బబ్బ.. ఎందుకింత చిన్న విషయానికి రాద్ధాంతం చేస్తావు? నీకు వీలు కాదని ఒక్క ముక్కలో చెప్తే సరిపోతుందిగా..''

''ఒక్క మాటలో చెప్తే అర్థమయ్యేట్టయితే మన సంసారం ఇలా ఎందుకు తగలడుతుంది? నేనూ మిగతావాళ్ళలా భోగభాగ్యాల్తో సుఖపడేదాన్ని. ఇలా అరకొర జీతాలకోసం ఉరుకులు పరుగులు తప్పేవి. అంతా నాఖర్మ.''

ఆమె విసురుగా బైటికెళ్ళిన శబ్దం తర్వాత చాలాసేపు నిశ్శబ్దం...నా కొడుకు లోపలి కొస్తాడేమోనన్న ఆశతో ఎదురుచూశా. రాలేదు. తనూ వెళ్ళిపోయి ఉంటాడు. లోపలికొచ్చి పరామర్శిస్తే బాధ్యతలు తలకు చుట్టుకుంటాయని భయపడి ఉంటాడు. కొద్ది విరామం తర్వాత పిల్లలిద్దరూ స్కూల్‌కెళ్ళిపోయారు. కనీసం వెళ్ళొస్తామని చెప్పకుండా.. బతికున్నానో లేదో కూడా చూడకుండా.. తల్లిదండ్రులకు తగ్గ పిల్లలు..



''ఒక్క మాటలో చెప్తే అర్థమయ్యేట్టయితే మన సంసారం ఇలా ఎందుకు తగలడుతుంది? నేనూ మిగతావాళ్ళలా భోగభాగ్యాల్తో సుఖపడేదాన్ని. ఇలా అరకొర జీతాలకోసం ఉరుకులు పరుగులు తప్పేవి. అంతా నాఖర్మ.''

లేచి కూచోడానికి ప్రయత్నించాను. కళ్ళు గిర్రున తిరిగాయి. నిస్త్రాణ... నన్ను భయపెట్టే ఒంటరితనం..

నాకు యుద్ధభూమి గుర్తొచ్చింది. రక్తం ధారాపాతంగా కారిపోతూ.. చీకటిలోకి జారుకుంటూ.. శత్రువు కళ్ళ పడకూడదని బాధని పళ్ళ బిగువున సహిస్తూ..బతికి బయటపడ్డ నేను..నాలోని శక్తినంతా కూడదీసుకుని లేచి కూచున్నాను. జ్వరం ఎంతుందో చూసుకోవాలి. థర్మామీటర్ ఎక్కడ పెట్టారో వెతుక్కోవాలి. కుడి తొడకు జైపూర్ కాలుని బెల్టుపెట్టి బిగించుకుని.. లేచి నిలబడ్డాను. తూలిపడబోయి గోడను ఆసరాగా చేసుకుని నడిచాను.

జ్వరం నూటనాలుగు డిగ్రీలుంది. విషజ్వరమా.. ఇలానే ఎవ్వరూ లేకుండా చచ్చిపోతానేమోనన్న ఆలోచన చావుకన్నా అధికంగా భయపెడుతూ ఎంత పిచ్చి మనసు.. ఎవ్వరైనా ఆసరాగా ఉంటే బావుండుననిపిస్తోంది.. ఎవ్వరైనా తోడుగా నిలబడితే చాలనిపిస్తోంది.

యుద్ధం ముగిసిన పదిహేను రోజులకు నన్ను హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ చేశారు. కుడికాలు తొడ దగ్గర్నుంచి తీసేశారు. ఎక్స్ సర్వీస్‌మన్ కోటాలో తపాలాశాఖలో ఉద్యోగం వచ్చింది. అప్పుడు బాబుకు పదేళ్ళు. ఒక్కగానొక్క కొడుకు. కష్టమనేది తెలీకుండా పెంచాం. మాకున్నంతలో వాడు కోరుకున్న ప్రతీదీ సమకూర్చిపెట్టాం. అయినా వాడికి అసంతృప్తి..వాడి జీవితం మా అసమర్థత వల్ల పాడైపోయిందని వాడి గట్టి నమ్మకం. లక్షలు పోసి ఇంజనీరింగ్ చదువులు చదివించే స్థోమత నాకెక్కడుంది? వాడు సరైన ర్యాంకులు తెచ్చుకోకపోతే నాదా బాధ్యత? ఇంటర్వ్యూల వరకైతే పంపగలను గానీ ఉద్యోగాలు తెచ్చి వాడి చేతిలో పెట్టలేనుగా.

వాడు పెట్టే హింసని తట్టుకోలేకనుకుంటాను నా భార్య పదేళ్ళ క్రితమే గుండెనొప్పితో చచ్చిపోయింది. నా కష్టసుఖాల్లో తోడుగా నిల్చిన భార్య పోయాక ఒంటరితనం క్యాన్సర్‌లా నా మనసుని కొద్దికొద్దిగా తినేయటం ప్రారంభించింది. కొడుకూ, కోడలూ, మనవడు, మనవరాలు ఉన్నా అనాథలా సమూహాల్లో తిరిగినా తీరని ఏకాకితనం.. నీడ కూడా తోడుంటానని బాస చేసి దగా చేసి వదిలిపోయిన భావన.

జీతం మొత్తం తెచ్చి కోడలి చేతిలో పోసినా కంచంలో అన్నంతో పాటు సూటిపోటి మాటలు వడ్డించేది. రిటైరై ఆరు నెలలు కూడా కాలేదు. తేరగా తింటున్నానంటోంది. యుద్ధ భూమిలో ప్రాణాలకు తెగించి పోరాడిన నేను ఈ అవమానాల్ని సహించలేకుండా ఉన్నాను. అసలీ క్షణమే వెళ్ళి ఏదో ఓ ఉద్యోగం వెతుక్కోవాలన్నంత ఆరాటం..

పెద్దగా వాంతికయింది. డాక్టర్ దగ్గరకు వెళ్ళకపోతే పరిస్థితి మరీ దిగజారేలా ఉంది. నా కొడుకూ కోడలికి మరింత అవకాశం ఇవ్వటం ఇష్టంలేక క్రోసిన్ టాబ్లెట్ ఒకటి వేసుకుని, పది నిమిషాలు విశ్రాంతి తీసుకున్నాను. ఎవరో నన్ను డాక్టర్ దగ్గరకు పిల్చుకెళ్ళటమేమిటి? నాకు నేనే వెళ్ళాలి. నా జబ్బు... నా కష్టం.. ఎవరి ఏడుపు వాళ్ళేగా ఏడ్వాలి.

ఓపిక చేసుకుని తెల్సిన డాక్టర్ దగ్గరకెళ్ళాను.

''ఇంత జ్వరంలో తోడెవ్వరూ లేకుండా ఎలా వచ్చారు? మధ్యలో ఏమైనా అయితేనో'' అన్నాడు.

తూటా తగిలి ఖలీల్ దబ్బున కింద పడిపోతే, ఆగి చూద్దామన్న అభిరాంని వారించిన విషయం గుర్తొచ్చి, చిన్నగా నవ్వి వూర్కున్నాను.

మరో మూడ్రోజులకు గానీ జ్వరం తగ్గలేదు.

నీరసం నిలువరిస్తున్నా వినకుండా ఉద్యోగాల వేటలో పడ్డాను.

''ఈ వయసులో ఏం పని చేయగలవు? అదే జీతానికి డిగ్రీలు, పీజీలు చదివిన కుర్రాళ్ళు బొచ్చెడు మంది దొరుకుతారు.'' అనో ''మాక్కావాల్సింది ఉత్సాహంగా పన్జేసే యంగ్ బ్లడ్. మీది విశ్రాంతి తీసుకునే వయసు.'' అనో అన్నవాళ్ళే ఎక్కువ. కొంత మందైతే ''అయ్యో ఈ వయసులో పన్జేయాల్సిన ఖర్మ పట్టిందే పాపం..'' అని జాలిపడ్డానే ఖాళీలు లేవనేశారు.

''నాక్కావల్సింది జాలి కాదు. ఉద్యోగం. ఎంత కష్టమైనా పడ్తాను. ఏ పనైనా చేస్తాను.'' అన్నాను.

వారం రోజులు అలుపనేది లేకుండా తిరిగితే చివరికి కొత్తగా కడ్తున్న ఓ కాంప్లెక్స్ కోసం నైట్ వాచ్‌మన్లు అవసరమని తెలిసింది.

గేట్ దగ్గరున్న వాచ్‌మన్‌నడిగి లోపలికెళ్ళాను. ఓ ప్లాస్టిక్ కుర్చీలో నల్లటి భారీకాయమొకటి కూచుని ఉంది. నన్ను చూసి ఏం పని అన్నట్లు కళ్ళెగరేశాడతను.

''వాచ్‌మన్ ఉద్యోగం ఖాళీగా ఉందని తెలిసి వచ్చానండి.'' అన్నాను.

''ఎక్కడుంటావ్'' అన్నాడతను ఎగాదిగా చూస్తూ.

ఆ వివరాల్తోపాటు నేను మిలట్రీలో పన్జేసిన విషయం, పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి రిటైరైన విషయం చెప్పాను.

''సరేసరే. నైట్ డ్యూటీ చేయాలి. నిద్ర పోకుండా కాపలా ఉండగలవా?''

''ఉంటానండి.''

''ఇప్పటికే నలుగురు వచ్చెళ్ళారు. నువ్వు ఐదోవాడివి. మాక్కావల్సింది ఒక్క వాచ్‌మన్. ఏం చేయాలో ఎవర్ని తీసుకోవాలో తెలీటం లేదు. జీతం ఐదువేలిస్తే చాలంటున్నారు.''

నేను వెంటనే ''నాకు నాలుగు వేలివ్వండి చాలు.'' అన్నాను.

అతను మరోసారి నన్ను నఖశిఖపర్యంతం చూశాడు.

''సిమెంటూ, స్టీలూ.. ఖరీదైన మెటీరియల్ ఉంటుంది. దొంగల బారిన పడకుండా జాగ్రత్తగా కాపాట్టం నీ డ్యూటీ. సక్రమంగా చేయగలవా?''

''యుద్ధభూమిలో శత్రుసైనికుల్ని నా తూటాలకు బలిచ్చినోడిని. మీ మెటీరియల్ని కాపాడలేనా?''

''పిచ్చోడిలా ఉన్నావే. ఇపుడు పరిస్థితులు ఎలా ఉన్నాయో పేపర్లలో చదవటం లేదా? రియల్ ఎస్టేట్ అంటే నెత్తుటి కూడే.. ఏ వైపునుంచి ఎవడొచ్చి కబ్జా చేస్తాడో తెలీదు. ఈ స్థలం తనదంటూ ఎవరెన్ని డాక్యుమెంట్లు సృష్టిస్తారో తెలీదు. ఏ వైపు నుంచి ఎవరు కత్తుల్తో దాడి చేస్తారో తెలీదు. యుద్ధభూమి నయం కదూ. సైనికులు అప్రమత్తంగా ఉంటారు. చేతుల్లో తుపాకులుంటాయి. చావడమో చంపడమో.. అంతే..''

నేనేమీ మాట్లాడకుండా నిలబడ్డాను.

''సరే. రేపు సాయంత్రం పన్లోకి వచ్చేయి.'' అన్నాడతను.

చాలా సంతోషమనిపించింది. అతనికి కృతజ్ఞతలు ఎలా చెప్పాలో తెలీక రెండు చేతులూ జోడించి నమస్కరించాను. వెనుదిరిగి నాలుగడుగులు వేశానో లేదో ''ఆగు. ఇట్రా.'' అన్నాడు.

''అలా నడుస్తున్నావేం? నీ కాలికేమైంది.'' నా వైపు అనుమానాంగా చూస్తూ అడిగాడు.

''యుద్ధంలో కాలు పోగొట్టుకున్నాను. ఇదీ జైపూర్ ఫూట్''

''ఓ కాలు లేకుండా వాచ్‌మన్‌గా నువ్వెలా పని చేయగలవ్? ఈ విషయం నాకు ముందే ఎందుకు చెప్పలేదు?'' అతని కళ్ళలో ఎర్రజీర..

''నా డ్యూటీని సక్రమంగా చేయగలనన్న నమ్మకం నాకుంది. కాలు లేకపోవడం అడ్డంకి కాదు.''

''నాకవసరం లేదు. వెళ్ళు''

చాలాసేపు అతన్ని బ్రతిమాలుకున్నాను. చివరికి ''మూడు వేలిచ్చిన చాలు. పనిచేస్తాను.'' అన్నప్పుడు అతను ఆలోచనలో పడ్డాడు.

''సరే. ఒక నెల్రోజులు చూస్తాను. రేపు ఆరింటికి వచ్చేయి.'' అన్నాడు.

ఆ రాత్రి ప్రశాంతంగా నిద్రపోయాను. పెన్షన్‌తోపాటు ఈ జీతమూ కోడలి చేతిలో పోస్తే తేరగా తింటున్నానని ఈసడించడం తగ్గిస్తుందన్న ఆశ...

మరునాడు సాయంత్రం చిన్న బాక్స్‌లో అన్నం పెట్టుకుని కాంప్లెక్స్‌కి చేరుకున్నాను. నిన్నటి వాచ్‌మన్ పల్కరింపుగా నవ్వాడు.

''డ్యూటిలో జాయిన్ కావడానికొచ్చా'' అన్నాను.

అతను జాలిగా చూశాడు. ''ఈ రోజు వేరే అతన్ని తీసుకున్నాడు. అదుగో అక్కడ నిలబడి ఉన్నాడు చూడు. అతనే.''

కాంట్రాక్టర్ కాంప్లెక్స్‌లో లేడు. ఇల్లు ఎక్కడో కనుక్కుని వెతుక్కుంటూ వెళ్ళా.

''నాకు పనిస్తానని చెప్పి మరొకతన్ని పన్లో పెట్టుకున్నారు. మీకిది ధర్మమా'' అని అడిగా.

''నువ్వు మూడువేలకు పని చేస్తానన్నావు. అదే జీతానికి అతనూ ఒప్పుకున్నాడు. నీకంటే వయసులో చిన్నవాడు. ఏ అవకరం లేని వాడు. ఇందులో అధర్మం ఏముంది? ఎక్కువ నాణ్యత గల వస్తువు తక్కువ ధరకు దొరుకుతుంటే నువ్వు ఎగబడవా?''

''మీరు నాకు ఉద్యోగం ఇస్తున్నట్లు మాటిచ్చారు. దానికైనా విలువివ్వరా?''

''మనం ఏ కాలంలో ఉన్నామనుకుంటున్నావు? ఇది కలికాలం. బాండ్ పేపర్ మీద రాసిచ్చిన వాటికే దిక్కు లేదు. ఇక నోటిమాటెంత?'' అతను వంకరగా నవ్వుతున్నాడు.. అతని మొహం వికృతంగా ఉంది.

ఖలీల్ ధర్మ యుద్ధం గురించి మాట్లాడినపుడు నేనేగా అన్నాను. ఇప్పటి యుద్ధంలో దెబ్బ కొట్టటమే ప్రధానమనీ.. ధర్మాధర్మాల ప్రసక్తి ఉండదనీ..

మరలా ఉద్యోగాల వేటలో పడ్డాను. ఎక్కే గుమ్మం దిగే గుమ్మం..

ఎముకలు కొరికే చలిలో బంకర్లలో కూచుని అవకాశం కోసం రోజుల తరబడి ఎదురుచూసినోణ్ణి. ఉద్యోగం వెతుక్కోవటంలో ఎదురౌతున్న కష్టాల్ని తట్టుకోలేనా? ఎటొచ్చీ యుద్ధం ఎప్పుడో ముగిసిందని పొరపడ్డాను. లేదు.. ఇంకా కొనసాగుతూనే ఉంది. ★

ఆత్రంగా వెళ్లి ప్రేమించడానికి ఆనక నాలిక్కరుచుకోవడానికీ నేనేమీ చిన్నపిల్లను కాదు. ఆలోచించే వయసొచ్చింది, ఎవరు ఎలాంటి వారో తెలుసుకునేటంత జ్ఞానముంది. ఆయన జీవితమే నా జీవితం కూడా అనే భ్రమలేవీ నాదగ్గర లేవు. నాక్కావాల్సిందల్లా ఇప్పుడు కాల్షీట్లే. ఎలాంటి పాత్రల్లో నటించాల్నో బిజీగా వున్నాను. అంతెందుకూ మీడియా వాళ్లే ఈరోజు పెళ్లయిందని రాస్తారు, రేప్పొద్దున మేమిద్దరం పనిమీద వేరే ఊర్లకు వెళ్లినా ఎడమొహం పెడమొహం అని రాస్తారు. నిజానిజాలు చూడరు. నిర్ధారణ చేసుకోరు. ఇవన్నీ ఎందుగ్గానీ ఇప్పుడు నా మనసంతా పెయింటింగ్స్‌ను వేయడంపైనే వుంది. ఈ మాటలంటున్నది అమీషాపటేల్. అసలు నా పర్సనల్ లైఫ్‌లో మీకేం పనీ అంటూ కసురుకుంటోంది!

